## షార్‌లో ఆజాద్ కి అమృత మహోత్సవం



శ్రీహరికోట (తడ), ఆగస్టు 2 ప్రభాతవార్త
శ్రీహరికోటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆజాదికీ అమృత మహోత్సవంలో భాగంగా పలు కార్యక్రమాలు చేపట్టారు. జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్యకు ఈ సందర్భంగా ఘనంగా నివాళి అర్పించారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.


# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త




## భారీ జాతీయ జెండాతో విద్యార్థులు ర్యాలీ



బంగారుపాళ్యం, ఆగస్టు 2 ప్రభాతవార్త: జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని పురస్కరించుకొని టేకుమంద జడ్పీ హైస్కూల్ విద్యార్థులు భారీ జాతీయ జెండాతో ఊరేగింపు చేపట్టారు. హెడ్మాస్టర్ సుభాన్ మాట్లాడుతూ జాతీయ జెండా రూపకల్పనలో పింగళి ప్రముఖ పాత్ర పోషించారని విద్యార్థులకు గుర్తు చేశారు. జెండా విశిష్టతను సైన్స్ టీచర్ షంషీర్ ఖాన్ విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు వేణురెడ్డి, జయప్రకాష్, సుమ, రవిచంద్రారెడ్డి, జయకుమారి, మోహన్‌రెడ్డి, సుబ్బలక్ష్మి, దేవేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

## గరుడగమన రారా...!

### గరుడవాహనంపై గోవిందుడు దర్శనం



పవిత్రమైన గరుడపంచమిరోజు శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సమూర్తి మలయప్పస్వామి గరుడునిపై విహరించారు. భక్తుల గోవింద నామస్మరణల మధ్య గరుడవాహనం మాఢవీధుల్లో ఊరేగింది
ప్రభాతవార్తప్రతినిధి, తిరుమల,

# తెలుగు జాతికి గర్వకారణం పింగళి వెంకయ్య

## మంత్రి రోజా



జాతీయ జెండాతో నిర్వహించిన ప్రదర్శనలో పాల్గొన్న రోజా

పుత్తూరు, ఆగస్టు 2 ప్రభాతవార్త :
దేశ ప్రజలందరూ తలెత్తుకుని ఎగురవేసే జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంగయ్య కావడం తెలుగు వారందరికీ గర్వకారణమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్.కె.రోజా అన్నారు. ఆజాదీ కా అమృతోత్సవ్ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నగరి పట్టణంలో జరిగిన జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య 146వ జయంతి కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక నగరి పిసిఎన్ హైస్కూలులో జాతీయ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పింగళి వెంకయ్య కుటుంబాన్ని గతంలో స్వయంగా కలిశారని తెలిపారు. ప్రజలంతా స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటున్నామంటే అందుకు కారణమైన స్వాతంత్ర సమరయోధుల ప్రాణ త్యాగాలను గుర్తు చేసుకుంటూ రేపటి తరాలకు తెలియజేసేందుకు ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఈ ఉత్సవాలను రాష్ట్రంలో ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. 1916లో దేశానికి ఒక పతాకం వుండాలనే ఉద్దేశ్యంతో పింగళి వెంకయ్య జాతీయ జెండాను రూపొందించారని తెలిపారు. 1921లో విజయవాడలో మహాత్మా గాంధి అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ సమావేశంలో వెంకయ్య రూపొందించిన పతాకాన్ని జాతీయ పతాకంగా గుర్తిస్తూ ప్రకటించారని గుర్తు చేశారు. దేశంలోనే కాదని, భారతీయులు ఎక్కడ వున్నా జాతీయ జెండా అక్కడ రెపరెపలాడుతూ వుంటుందని పేర్కొన్నారు. భారతదేశంలోని అన్ని ప్రాంతాలన్నీ తెలుగు వారిని గౌరవించేలా శాశ్వత కీర్తిని తెలుగు వారికిచ్చిన పింగళి వెంకయ్య గొప్పతనాన్ని భావితరాలు ఎప్పటికీ గుర్తుంచుకునేలా ఇలాంటి వేడుకలు మరిన్ని నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం సాంస్కృతిక శాఖ పింగళి వెంకయ్య, అతని కుటుంబ సభ్యుల చిత్రాలతో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆమె తిలకించారు. అనంతరం జాతీయ జెండాతో పిసిఎన్ స్కూల్ నుంచి ఓం శక్తి గుడి వరకూ భారీ ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, వైకాపా నాయకులు, విద్యార్థులు, అధికారులు పాల్గొన్నారు.



## దేశానికి ఎనలేని సేవలు చేసిన జాతీయ పతాక రూపకర్త

### -2వేల అడుగుల జాతీయజెండా ప్రదర్శన

గూడూరు, ఆగస్టు 3 ప్రభాతవార్త
ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా జాతీయ పతాక రూపకర్త, స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య జయంతి ఉత్సవాలను గూడూరులో ఘనంగా నిర్వహించారు. ఈసంధర్భంగా గూడూరు శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు 2వేల అడుగుల జాతీయ జెండా ప్రదర్శన ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఈర్యాలీని గూడూరు ఆర్డీఓ మురళీకృష్ణ పాల్గొని ప్రారంభించారు. ముందుగా పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులుర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. ఈసంధర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ దేశ ప్రజలందరూ గర్వపడేలా జాతీయ పతాకాన్ని రూపొందించిన వ్యక్తి పింగళి వెంకయ్య అన్నారు. కుంకుమ, తెలుపు, ఆకుపచ్చ రంగులతో మధ్యలో చక్రంతో భారత జాతీయ పతాకాన్ని రూపొందించడం గొప్పవిషయమన్నారు.

## స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారిని గుర్తించడానికే

# ఆజాదీకా అమృత్ మహోత్సవ్



– జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్

చిత్తూరు, ఆగస్టు 2 ప్రభాతవార్త:
దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాలు పూర్తి చేసుకొన్న నేపథ్యంలో గత మార్చి 12వ తేదీ నుండి దేశ వ్యాప్తంగా ఆజాదీకా అమృత్ మహోత్సవాలు నిర్వహించుకొంటున్నామని ఈ నెలలో ప్రతిరోజు ఒక కార్యక్రమంను చేపట్టి దేశానికి స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారిని మననం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. మన రాష్ట్రంలో జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య, దేశానికి స్వాతంత్ర్యం కోసం నాటక రూపంలో ప్రజల్లో గొప్ప మార్పు తీసుకువచ్చిన బళ్ళారి రాఘవ జయంతి వేడుకలను మంగళవారం చిత్తూరు కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, డిఆర్ఓ రాజశేఖర్ పింగళి వెంకయ్య, బళ్ళారి రాఘవ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జెసి వెంకటేశ్వర్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడానికి ఎందరో మహానుభావులు నిరసనలు వ్యక్తం చేశారని, సహాయ నిరాకరణ చేయడం జరిగిందన్నారు. మన దేశానికి ఒక జెండా వుండాలని ఆ జెండా త్రివర్ణ పతాకంతో అశోకుడి గుర్తు వుండేలా రూపొందించిన పింగళి వెంకయ్య కృష్ణా జిల్లాలో పుట్టి జాతీయ జెండాను రూపొందించడం జరిగిందన్నారు. బళ్ళారి రాఘవ వంటి వారికి జన్మ ఇచ్చిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని డిఆర్ఓ రాజశేఖర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ర్యాలీని నిర్వహించి జెండాకు గౌరవ వందతనం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఓ ఉమాదేవి, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ, ఇతర కలెక్టరేట్ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పిడుగు పాటుకు పాడి ఆవులు మృతి



వెదురుకుప్పం, ఆగస్టు 2 ప్రభాతవార్త :
మండలంలోని మంగళవారం సాయంత్రం కురిసిన వర్షం సమయంలో పిడుగు పడటంతో రెండు పాడి ఆవులు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం మేరకు... మండలంలోని తిరుమలయ్యపల్లె పంచాయితీ పరిధిలోని మాకమాంబపురంకు చెందిన గుర్రప్ప రెడ్డికి చెందిన రెండు పాడి ఆవులు మృతి చెందినట్లు చెప్పారు. పిడుగు పాటుకు తన రెండు పాడి ఆవులు మృతి చెందడంతో రైతు తీవ్ర ఆవేదనకు గురైన్నాడు. సుమారు లక్ష రూపాయలు విలువ చేసే పాడి ఆవులు మృతిచెందడంతో కుటుంబ పోషణకు ఎలా రైతు కన్నీటి పర్యంతమయ్యాడు. అధికారులు, ప్రభుత్వం స్పందించి రైతుకు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

# టిడిపి పతనానికి లోకేష్ కంకణం !



## అధికార పార్టీ ఎమ్మెల్యేల మాటలయుద్ధం!

ప్రభాతవార్త–తిరుపతి:
శ్రీజ పాలవ్యవహారం చిలికిచిలికి గాలివానలా తెలుగుదేశం పార్టీ మాజీ మంత్రి, ఎమ్మెల్సీ నారా లోకేష్‌పై అధికారపార్టీ ఎమ్మెల్యేల మాటలయుద్ధానికి తెరలేపింది. ఏకంగా నలుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీతో సహా చిత్తూరు జిల్లా పరిషత్ ఛైర్మన్ చివరకు శ్రీజ పాల డెయిరీ సిఇఓ తిమ్మప్ప కూడా ఘాటుగా స్పందించడం అటు చిత్తూరు, ఇటు తిరుపతి జిల్లా ప్రజల్లో ఆసక్తికరంగా మారింది. ఎవరో చేసిన నిరాధార ఆరోపణలపై టిడిపి యువనాయకుడు నారాలోకేష్ అసత్య దుష్ప్రచారాలు చేశారంటూ అధికార పార్టీ ప్రజాప్రతినిధులు మాటల యుద్ధంతో విరుచుకుపడ్డారు. ఇందుకు మంగళవారం సాయంత్రం తిరుపతిలోని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి క్యాంపు కార్యాలయంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, పలమనేరు ఎమ్మెల్యే వెంకటేశ్‌గౌడ్, మదనపల్లి ఎమ్మెల్యే నవాజ్‌బాషా, పీలేరు ఎమ్మెల్యే చింతలరామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ కెఆర్‌జె భరత్, చిత్తూరు జడ్పీఛైర్మన్ గోవిందప్పశ్రీనివాసులు నారా లోకేష్‌పై, టిడిపి అధినేత చంద్రబాబునాయుడు పాలనలో జరిగిన పలు రకాల అక్రమాలు, అవినీతిపై మండిపడ్డారు. ఏకంగా నారాలోకేష్ తెలుగుదేశంకు ఐరన్‌లెగ్ అని, తండ్రి ముఖ్యమంత్రి పదవిని అడ్డుపెట్టుకుని ఎమ్మెల్సీ, మంత్రి పదవులు అనుభవించాడని విమర్శించారు. అంతేగాక ప్రత్యక్ష ఎన్నికల్లో మంగళగిరిలో ఘోర ఓటమిచెందాడని వ్యాఖ్యానించారు. చిల్లరవీడియో ట్విట్వర్‌పెట్టడం సిగ్గుచేటని అన్నారు. టిడిపిని లోకేష్ నాశనం చేసేందుకు కంకణం కట్టుకున్నారని, అందుకే సీనియర్‌నాయకుడు, విలువలున్న ప్రజానేత పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డిపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. రాజకీయాలకు గుడ్‌బై చెప్పే పరిస్థితి లోకేష్‌కు దగ్గరలోనే వుందని ఘాటుగా విమర్శించారు. పదిమందికి మంచిచేస్తే పెద్దాయన అని అంటారని, ఇది ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా మంత్రి పెద్దిరెడ్డిని సామాన్యప్రజలు కూడా పెద్దాయన అని సంభోదిస్తున్నారని, అయితే చంద్రబాబును వెన్నుపోటుదారుడని సొంత పార్టీనేతలే విమర్శిస్తున్నారన్నారు. లోకేష్‌కు సంస్కారం, మర్యాద తెలియదని ఎద్దేవాచేశారు. కర్నాటకలో ఓ నేరంలో నిందితుడుగా వున్న వ్యక్తి చేసిన పసలేని ఆరోపణలపై లోకేష్ స్పందించడం మరీ పనికిమాలిన తనమన్నారు. పెద్దిరెడ్డి కుటుంబం మంచితనం ఏంటో చిత్తూరు, తిరు పతి జిల్లాల్లో సామాన్యప్రజలను అడిగితే నిజం ఏమిటో తెలుస్తుందన్నారు. 2014 మేనిఫెస్టోతీసుకుని లోకేష్ వస్తే 2019 మేనిఫెస్టో తీసుకుని తాను కుప్పం బస్టాండ్‌లో చర్చకు సిద్ధమని ఎమ్మెల్సీ భరత్ సవాల్ విసిరారు. చంద్రబాబుకు పీడ లోకేష్ అని విమర్శించారు. పెద్దిరెడ్డి పై వ్యాఖ్యలు చేసే స్థాయిలో లోకేష్ లేడని, ఆరోపణలు చేసే ముందు పదివిషయాలు తెలుసుకుని మాట్లాడితే, పోస్టులు పెడితే సంస్కారం ఉన్నవాడిలా తెలుస్తుందని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు లోకేష్‌పై మాటలయుద్ధానికి దిగారు.

## గంజాయి స్వాధీనం ముగ్గురు అరెస్టు



వడమాలపేట, ఆగస్టు 2, ప్రభాతవార్త
గంజాయిని తరలిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రెండు కేజీల గంజాయితో పాటు 70500 రూపాయిలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు రేణిగుంట డిఎస్‌పి రామచంద్ర తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. గంజాయిని తరలిస్తున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు రేణిగుంట సిఐ ఆరోహన రావు, వడమాలపేట ఎస్ఐ రామాంజనేయులు పోలీస్ సిబ్బందితో వెళ్లి పాదిరేడు రోడ్డులోని ఆరిమాను గుడి వద్ద అనుమాన స్పందంగా కనిపించిన ముగ్గురు వ్యక్తులను ప్రశ్నించారు. వారిని సోదా చేయగా గంజాయి, డబ్బులు ఉండడంతో గోవిందస్వామి, విజయమ్మ నగరి, నాగమ్మ ఏర్పేడు మండలం వికృతమాల అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

# ఇష్టారాజ్యంగా ఇసుక మాఫియా!



**జెసిబిలతో తెల్లబంగారం తరలింపు**
**కదులుతున్న ఇళ్ల పునాదులు**
**మామూళ్ల మత్తులో పోలీసులు**
**దిక్కుతోచని స్థితిలో యజమానులు**

తిరుచానూరు, ఆగస్టు 2 ప్రభాతవార్త:
రమణా లోడెత్తాలారా..మనకు చెక్ పోస్టు లేదురా అంటూ ఇష్టా రీతిన ఇసుక మాఫియా రాజ్యమేలుతోంది. వివరాల్లోకి వెళితే తిరుపతి కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్న ముళ్లపూడి వద్ద పద్మనివాసిని టవర్స్ వద్ద గల స్వర్ణముఖి నదిలో నిత్యం విచ్చలవిడిగా ఇసుకాసురులు అక్రమంగా ఇసుక తరలిస్తూ లక్షల్లో దోచుకుంటున్నారు. నిరుపేదలు, సామాన్య ప్రజలు అప్పు సప్పు చేసి కట్టుకున్న ఇళ్ల వద్ద ఇసుకను తోడేస్తుండటంతో ఇంటి పునాదులు పైకి తేలుతున్నాయి. దీనికి తోడు వర్షాలు కురవడంతో ఏరు మొత్తం అక్కడక్కడ ఇసుక బావులుగా తయారవుతున్నాయి. గతంలో వరదల సమయంలో కలిగిన తీవ్రమైన నష్టాలు కళ్లముందు కనపడుతున్నా మళ్లీ ఇళ్ల పక్కన ఇసుక తోడేందుకు ఏమాత్రం వెనుకాడటంలేదు. దీని వలన ఏమైనా జరగరాని ప్రమాదం జరిగి ఆస్తి నష్టం, ప్రాణ నష్టం కలిగితే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రజలు వాపోతున్నారు. పోలీసులు మామూళ్ల మత్తులో మిన్నకుండిపోతున్నారని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. దీనికి సంబంధించి స్థానిక నాయకులు, ఎంఆర్ఓ, విఆర్ఓ తదితర అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో, గతంలో రాత్రుల్లో మాత్రమే దొంగతనంగా తరలించే ఇసుకను నేడు పట్టపగలే దర్జాగా అక్రమంగా తరలిస్తున్నా అడ్డుకునే నాథుడే కరువయ్యాడు. రాజకీయ నాయకుల అండ ఉండడంతో పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఇసుకాసురులపై తగిన చర్యలు తీసుకోక పోతే..జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించుకుంటామని అపార్టుమెంట్ వాసులు, స్థానికులు తెలిపారు.

# సమగ్ర భూసర్వే వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్



కుప్పంరూరల్/రామకుప్పం, ఆగస్టు 2 ప్రభాతవార్త
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక ంగా చేపడుతున్న సమగ్ర భూముల రీసర్వేను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశించారు. మంగళవారం కుప్పం మండలం వెండుగంపల్లి, రామకుప్పం మండలం మణీంద్రంలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక పర్యటన చేపట్టారు. ఈసందర్భంగా భూముల రీ సర్వే ప్రక్రియను పరిశీలించారు. గ్రౌండ్ ట్రూథింగ్ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం వెండుగంపల్లి సచివాలయ భవన నిర్మాణంకు డబ్బులు పడినా ఎందుకు పూర్తి చేయలేదని అధికారులను కలెక్టర్ ప్రశ్నించారు. సెప్టెంబర్ నెలాఖరుకల్లా పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. అనంతరం సచివాలయంను తనిఖీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తకు ౘవ పెట్టుబడితో వ్యవసాయం చేసేందుకు రైతులకు అవగాహనను రైతు భరోసా కేంద్రాల్లో కల్పించి ఆర్‌బికె సేవలు మరింత చేరువ చేయాలన్నారు. రైతులకు ఆధునిక వ్యవసాయ సాగు పద్ధతులకు తగు సలహాలు, సూచనలు అందించాలన్నారు. పరమసముద్రం గురుకుల పాఠశాల, కళాశాలను పరిశీలించారు. పాఠశాలకు ఆర్ఓ ప్లాంట్, ప్రహరీ మంజూరు చేయాలని ప్రిన్సిపాల్ కలెక్టర్‌ను కోరారు.

**స్థానిక సమస్యలపై కలెక్టర్‌తో ఎమ్మెల్సీ భరత్ చర్చలు :**
రామకుప్పం మండలంలో ఉన్న స్థానిక సమస్యలపై జిల్లా కలెక్టర్ హరినారాయణన్‌తో చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ చర్చించారు. 89 పెద్దూరు నుంచి ఆంబూరు, రామాపురం తాండా – సింగసముద్రం, దేవరాజపురం – వీర్నమల వరకు రోడ్లు మంజూరు చేయాలని ఎమ్మెల్సీ కలెక్టర్‌ను కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. అంతకుముందు స్థానిక ఎంపిపి సుబ్రమణ్యం, జడ్పీటిసి నితిన్‌రెడ్డి, మండల కన్వీనర్ బాబురెడ్డి , కో కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్ మురళి కలెక్టర్‌కు సమస్యలపై వినతిపత్రం అందించారు. రామకుప్పంలోని షాదీఖానాను అభివృద్ధి చేయాలని, విజలాపురంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని కల్పించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శివయ్య, తహశీల్దార్ సురేష్‌బాబు, ఎంపిడిఓలు రాధాకృష్ణ, విజయ్‌దత్, సర్పంచ్ ధర్మాచారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అర్హులందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుబాటులో.

-624 మందికి నూతన పెన్షన్ పంపిణీ - ఎమ్మెల్యే వెంకటేగౌడు.

పెద్దపంజాణి ఆగస్టు 2 ప్రభాతవార్త :



నియోజకవర్గ వ్యాప్తంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందిస్తున్న ఘనత వైకాపా ప్రభుత్వందేనని,ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి గారి ఆధ్వర్యంలో ప్రతి లబ్దిదారుడికి సకాలంలో ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యేవెంకటేగౌడు తెలిపారు.మండలంలో నూతనంగా 624మంది పెంన్షన్ అర్హులకు నూతన పెన్షన్‌లను ఆయన పంపిణీ చేసే కార్యక్రమం మంగళవారంచేపట్టారు. కార్యక్రమంలో ఎంపిపి రెడ్డెప్ప,జెడ్పిటిసి సుష్మాకీర్తి,మండల కన్వీనర్ బాగారెడ్డి, శంకరప్ప,తమ్మిరెడ్డి,రాజారెడ్డి,ప్రసాద్ రెడ్డి,సుహేబ్,సర్పంచ్ అఖిలాజాఫర్,మోహన్ రెడ్డి,రహంతుల్లా ,సర్పంచులు,ఎంపిటిసిలు,వైకాపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహనీయుల స్ఫూర్తితో ముందడుగు

- కమీషనర్ డాక్టర్ జె.అరుణ

చిత్తూరు, ఆగస్టు 2 ప్రభాతవార్త:



దేశ స్వాతంత్ర్యం ఎందరో మహానుభావుల త్యాగఫలమని, అలాంటి మహనీయుల స్ఫూర్తితో ముందడుగు వేయాలని మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ పేర్కొన్నారు. ఆజాదికా అమృత్ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో త్రివర్ణ పతాకం రూపకర్త పింగళి వెంకయ్య, నాటకాలతో స్వాతంత్ర్య కాంక్షను పెంచిన బళ్ళారి రాఘవ జయంతులను పురస్కరించుకొని వారికి మేయర్ అముద, కమీషనర్ డాక్టర్ జె.అరుణలు ఘనంగా నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 13న ప్రతి ఇంటిపైన జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని గుండెల నిండా చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో కస్తూరిభా నగర పాలక పాఠశాల బాలికల ప్రసంగం, దేశభక్తి గీతాలాపన అందరిని అకట్టుకొన్నాయి. ఈ కార్యక్రమంలో సహాయక కమీషనర్ గోవర్ధన్, ఎంహెచ్ఓ డాక్టర్ అనిల్‌కుమార్, ఎంఇ ధనలక్ష్మీ, ఎసిపి రామకృష్ణుడు, మేనేజర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, నగర పాలక సంస్థ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఘనంగా నాగులచవితి వేడుకలు

బంగారుపాళ్యం, ఆగస్టు 2 ప్రభాతవార్త:



బోయకొండ గంగమ్మ ఆలయ ఆవరణలో మంగళవారం ఘనంగా నాగులచవితి వేడుకలు నిర్వహించారు. నాగ దేవతలకు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ పూజలను అటూరి వంశస్తులు నిర్వహించారు. ప్రతి ఏడాది నాగులచవితి రోజు నాగ ప్రతిష్టలకు పూజలు నిర్వహించడం జరుగుతున్నది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కృష్ణప్ప, రాధమ్మ, అట్లూరి వేణుగోపాల్, బుస్సా నాగరాజు, శివరాజు, శివలింగయ్య, నరసింహులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో పడి వ్యక్తి మృతి

బంగారుపాళ్యం, ఆగస్టు 2 ప్రభాతవార్త:



మొగిలిఘాట్ అటవీ ప్రాంతంలో గౌనిచెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందినట్లు బంగారుపాళ్యం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ నరసింహారెడ్డి తెలిపారు. గంగవరం మండలం జర్రావారిపల్లి గ్రామంకు చెందిన ఏడుగురు తాపి మేస్త్రీ కూలీలు ఆదివారం మొగిలిలో కూలీ పనులు చేశారు. ఈ ఏడుగురు కూలీలు ఆదివారం మధ్యాహ్నం గౌనిచెరువులో స్నానం చేయడానికి వెళ్ళారు. ఆ సమయంలో బాలాజీ(40) చెరువులో పడి మృతి చెందాడు. మంగళవారం బాలాజీ మృతదేహం పైకి తేలడంతో మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు బాలాజీకి భార్య, పిల్లలు వున్నారు. ఈ మేరకు ఇన్స్‌పెక్టర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తహసిల్దారు కార్యాలయం ఎదుట ధర్నా

పాలసముద్రం, ఆగస్టు 2 ప్రభాతవార్త:



2012 సంవత్సరంలో ఇచ్చిన ఇళ్ళ స్థలాలు ఇప్పుడు రద్దు అయ్యాయని కొంతమంది నాయకులు ఆ స్థలాలను ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని తమకు న్యాయం చేయాలని కెఆర్ కండ్రిగ గ్రామ ప్రజలు మంగళవారం తహసిల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి ప్రజలు మాట్లాడుతూ 2012 సంవత్సరంలో తాము 2 వేల రూపాయలు చెల్లిస్తే రెవెన్యూ అధికారులు గ్రామస్తులకు ఇంటి పట్టాలు మంజూరు చేశారన్నారు. అప్పటి నుండి తాము ఆ స్థలాల్లో ఇళ్ళు నిర్మించుకోలేదని అయితే ఇప్పుడు కొంతమంది నాయకులు ఆ ఇంటి పట్టాలు రద్దు అయ్యాయని పేర్కొంటు ఆ స్థలాలను ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. తమకు మంజూరు చేసిన ఇంటి పట్టాలను తమకే అప్పగించాలని ప్రజలు డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం గ్రామస్తులు తహసిల్దారు కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందించారు.

## ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానంకు సహకరించాలి

తవణంపల్లె, ఆగస్టు 2 ప్రభాతవార్త:

ఓటరు గుర్తింపు కార్డుతో ఆధార్ అనుసంధానం ప్రకియకు రాజకీయ పార్టీలు సహకరించాలని తహశీల్దార్ జయంతి అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు గుర్తింపు కార్డుతో ఆధార్ అనుసంధానం ప్రకియ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైకాపా తరపున గాంధీబాబు, సరకల్లు హరిరెడ్డి తడకర మధుకుమార్, బిజేపీ తరపున కెవి.చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం - ఎమ్మెల్సీ

కుప్పంరూరల్, ఆగస్టు 2 ప్రభాతవార్త



పేదల సంక్షేమమే సిఎం జగనన్న ధ్యేయమని చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ పేర్కొన్నారు. దాసేగానూరు పంచాయతీలో ఎమ్మెల్సీ గడపగడపకు మీ ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటా తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో రాష్ట్ర వన్నియకులక్షత్రియ కార్పోరేషన్ ఛైర్మన్ వనిత శ్రీను, జడ్పీటిసి ఎడిఎస్ శరవణ, సర్పంచ్ మురుగేష్, నేతలు తిమ్మోజి గౌడు, రామప్ప, జివి రమేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంఆర్‌పిఎస్ నేతల అర్ధనగ్న దీక్ష

కుప్పం, ఆగస్టు 2 ప్రభాతవార్త

ఎస్సీ వర్గీకరణ కోరుతూ కుప్పంలో ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నేతలు మంగళవారం కుప్పంలో అర్ధనగ్న దీక్ష చేపట్టారు.వారు మాట్లాడుతూ అధికారంలో వచ్చిన వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామని భాజపా ప్రభుత్వం మోసగించిందన్నారు.అన్నిరాజకీయపార్టీలువర్గీకరణపైతమవైఖరిప్రకటించాలన్నారు. నేతలు దేవరాజ్, రాజ్‌కుమార్, ప్రకాష్, మురుగేష్, రవీం ద్ర, గోవిందప్ప, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పింగళి వెంకయ్య జయంతి

శాంతిపురం, ఆగస్టు 2 ప్రభాతవార్త



జాతీయపతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని మంగళవారం మండల సచివాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. అలాగే ప్రముఖ న్యాయవాది రంగస్థల నటుడు బళ్లారి రాఘవ 142 జయంతిని సైతం నిర్వహించారు. ఇద్దరి చిత్రపటాలకు పూజలు చేశారు. వారి సేవలను అధికారులు, నేతలు కొనియాడారు. విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో జడ్పీటిసి శ్రీనివాసులు, ఎంపిపి వసుంధరకోదండరెడ్డి, విజయ్‌కుమార్, వినోద్‌కుమార్‌నాయుడు, ఎంపిడిఓ హేమమాలిని, తహశీల్దార్ లోకేశ్వరరావు, ఆర్ఐలు మధు, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## ద్రవిడ వర్సిటీలో విద్యార్థినులకు వైద్య శిబిరం

కుప్పం, ఆగస్టు 2 ప్రభాతవార్త

ద్రవిడ విశ్వవిద్యాలయంలో చదువుకుంటున్న విద్యార్థినులకు గుడుపల్లె పిహెచ్‌సి అధ్వర్యంలో వైద్య శిబిరంను వర్సిటీ ఉపకులపతి ఆచార్య తుమ్మ ల రామకృష్ణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థినుల ఆరోగ్యం దృష్ట్యా ఈ శిబిరం ఏర్పాటుచేశామన్నారు. కార్యక్రమంలో డా॥ పాల్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ డా॥ వేణుగోపా ల్‌రెడ్డి, వార్డెన్లు డా॥ యశోద, డా॥ మెర్సీ జ్యోతి పాల్గొన్నారు.

## జాతి గౌరవానికి ప్రతీక జాతీయ జెండా

పెద్దపంజాణి ఆగస్టు 2 ప్రభాతవార్త :



ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా ఆంధ్రా ప్రాంతానికి చెందిన తెలుగుతల్లి ముద్దుబిడ్డ,భారత జాతీయ పతాక రూపకర్త జెండా వెంకయ్యగా కీర్తిగాంచిన పింగళి వెంకయ్య 146వ జయంతి మరియు బల్లారి రాఘవగార్ల జయంతి మంగళవారం పెద్దపంజాణి పోలీస్ స్టేషన్‌లో ఎస్సై స్వర్ణతేజ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

## జాతీయ పతాక రూపకర్తకు ఘన నివాళి.

పెద్దపంజాణి ఆగస్టు 2 ప్రభాతవార్త :



ఆజాది కా అమృత్ మహోత్సవంలో భాగంగా వే ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ పైడి అంకయ్య పిలుపు మేరకు పింగళి వెంకయ్య 146వ జయంతి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల నాగిరెడ్డిపల్లి నందు ప్రధానోపాధ్యాయులు బాబూరెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.విద్యా ర్థులు తయారు చేసినజైపింగళిఅనేఅక్షరాలనుజాతీయజెండాలతోఅలంకరించినదృశ్యంచూపరులను ఆకట్టుకుంది. ఉపాధ్యాయులు మీనాక్షి,సుజాత,వాణిశ్రీ, అంజప్ప, రాజేష్ బాబు,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## పోస్టాఫీస్‌లో నూతనంగా ఏటిఎం సేవలు.

పలమనేరు ఆగస్టు 2 ప్రభాతవార్త :

పలమనేరు మండలంలోని హెడ్‌పోస్టాఫీస్ నందు నూతనంగా ఏటిఎం,మెబైల్ బ్యాకింగ్ సేవలను ఇన్స్‌పెక్టర్‌మధన్‌మోహన్‌మంగళవారంప్రారంభించారు.అనంతరంనెట్‌బ్యాకింగ్,మెబైల్‌బ్యాకింగ్ సౌకర్యాలపై అవగాహన కల్పించడంతో పాటు తదితర సేవలు ఎలా వినియోగించుకోవాలో అవగాహన కల్పించారు.నూతనంగా పోస్టాఫీస్ నందు ఏర్పాటు చేస్తున్న సౌకర్యాలను జీవితభీమా మరియు ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఘనంగా పింగళి వెంకయ్య జయంతి

కుప్పంరూరల్, ఆగస్టు 2 ప్రభాతవార్త



జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య 146వ జయంతిని కుప్పంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీ విగ్రహం పింగళి వెంకయ్యకు ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు డా॥ బిఆర్ సురేష్‌బాబు, మాజీ టౌన్‌బ్యాంక్ ఛైర్మన్ పివి ఉపేంద్రకుమార్, నేతలు ఆర్వీఎం రాజా, వెంకటరమణబాబు, రమేష్‌రెడ్డి, షబ్బీర్, నాగరాజాచారి, చంద్ర, కుమార్‌బాబు పాల్గొన్నారు. అలాగే ద్రవిడ వర్సిటీలో పింగళి వెంకయ్య, బళ్లారి రాఘవ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వర్సిటీ ఉపకులపతి ఆచార్య తుమ్మల రామకృష్ణ, రిజిస్ట్రార్‌డా॥వేణుగోపాల్‌రెడ్డితదితరులుపాల్గొన్నారు.అలాగే బిరుదనపల్లి పాఠశాలలో హెచ్ఎం శ్రీనివాసన్ అధ్వర్యంలో పింగళి జయంతి నిర్వహించారు. ఉపాధ్యాయురాలు సుకన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

**రామకుప్పం :**మండలంలోని బందార్లపల్లి సచివాలయంలో పింగళి వెంకయ్య జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజగోపాల్, కార్యదర్శి శ్రీనాథ్‌రెడ్డి, నేతలు చెంగారెడ్డి, కేశవరెడ్డి, జనార్ధనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కులమతాలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు - ఎమ్మెల్సీ

కుప్పం, ఆగస్టు 2 ప్రభాతవార్త



సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కులమతాలకు అతీతంగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్, మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నూతనంగా మంజూరైన వైఎస్సార్ పెన్షన్లను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల కంటే ఇవ్వని హామీలు సైతం అమలు చేస్తున్న ఘనత సిఎం జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రజలు వైకాపాను మరింత ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్లు మునస్వామి, హఫీజ్, కమీషనర్ రవిరెడ్డి, ఎపిఐడిసి డైరెక్టర్ నందకుమార్, ఎపిసిఎస్‌సి డైరెక్టర్ శ్రీనివాసమూర్తి, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ విదేశీ కంపెనీతో 'విజయం' ఒప్పందం

చిత్తూరురూరల్, ఆగస్టు 2 ప్రభాతవార్త :

నాక్ ఏ+ గ్రేడ్ సాధించిన విజయం డిగ్రీ సైన్స్ అండ్ ఆర్ట్స్ డిగ్రీ కళాశాల అంతర్జాతీయ స్థాయి కలిగిన డిజర్ట్ సైడ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌తో ఒప్పందం చేసుకొన్నట్లు విజయం విద్యాసంస్థల అధినేత ఎం.తేజోమూర్తి తెలిపారు. దుబాయ్ కేంద్రంగా పలు దేశాలలోని విద్యార్థులకు వివిధ రకాల కంప్యూటర్ కోర్సులు, విదేశీ భాషలను ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా బోధించి కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు దుబాయ్ ప్రభుత్వంచే సర్టిఫికేట్స్ మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు హమ్మీద్ హుస్సేన్, మహమ్మద్ రూయి, ఉమ్మర్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయపతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలు

చిత్తూరురూరల్, ఆగస్టు 2 ప్రభాతవార్త:



శ్రీమతి ఎన్‌పి సావిత్రమ్మ ప్రభుత్వ కళాశాలలో మంగళవారం జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య జయంతి వేడుకలను తెలుగు, హిందీశాఖల సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.కె. మనోహర్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకబృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

## త్రివర్ణ పతాక రూపకర్తకు ఘన నివాళి

వెదురుకుప్పం, ఆగస్టు 2 ప్రభాతవార్త :



జాతీయ జెండా త్రివర్ణ పతాకంను రూపొందించిన పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా ఆయనకు ఎంపిడివో సుధాకర్‌రావు, జడ్పీటిసి సుకుమార్ ఘనంగా నివాళి అర్పించారు. మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయంలోమంగళవారం పింగళి వెంకయ్య చిత్ర పటంకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల వైసీపీ అధ్యక్షులు పద్మనాభ రెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, మాజీ పార్టీ అధ్యక్షులు ధనంజేయులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయం

వెదురుకుప్పం, ఆగస్టు 2 ప్రభాతవార్త :

అర్హులందరికి సంక్షేమ పథకాలు అందజేయడమే జగనన్న ప్రభుత్వ ధ్యేయమని వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్ రెడ్డి పేర్కొన్నారు. జక్కదొన సచివాలయంలో కొత్తగా మంజూరైన పింఛన్లను మంగళవారం పంపిణీ చేశారు. జడ్పీటిసి చలం పాళ్యం సుకుమార్, సర్పంచ్‌లు శ్రీనాథ రెడ్డి,కావేరి,ఎంపిడివో సుధాకర్‌రావు,తహశీల్దార్‌పుల్లా రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

సూళ్లూరుపేట,కోట,వెంకటగిరి ,బాలాయపల్లి దొరవారిసత్రం,

## స్వాతంత్ర్య సమరయోధులకు ఘననివాళి

తడ, ఆగస్టు 2 ప్రభాతవార్త



తడ ఎంపీడీవో కార్యాలయంలో ఆజాది కీ అమృత్ మహోత్సవంలో భాగంగా మంగళవారం స్వాతంత్ర్య సమరయోధులకు ఘనంగా నివాళి అర్పించారు. జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రముఖ నాటకరంగ నటుడు బళ్లారి రాఘవల చిత్రపటాలకు పూజలు చేశారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ విజయకుమార్, పలువురు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. మండలం లోని పాములమిట్ట ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఉస్మాన్‌బాషా ఆధ్వర్యంలో పింగళి వెంకయ్యకు ఘనంగా నివాళి అర్పించారు.

## మహనీయుల త్యాగాలను స్మరించుకుందాం

-గూడూరు మున్సిపల్ కమిషనర్ సాయినాథ్

గూడూరు,ఆగస్టు 3 ప్రభాతవార్త



స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ మహనీయులు గౌరవించుకోవడం భారతజాతి సంస్కృతి అని గూడూరు మున్సిపల్ కమిషనర్ టి.సాయినాథ్ పేర్కొన్నారు.మంగళవారం గూడూరు రెండో పట్టణపరిధిలోని 15వ సచివాలయంలో జాతీయజెండా రూపశిల్పి పింగళి వెంకయ్య చిత్రపటానికి పులమాలలు వేసి నివాళులు అర్పించారు.స్వాతంత్ర సమరయోధులు బళ్లారి రాఘవులు జయంతి,పింగళి వెంకయ్య జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈసంధర్బంగా కమీషనర్ మాట్లాడుతూ పింగళి వెంకయ్య భారతదేశ జాతీయ జెండాను రూపకల్పన చేశారన్నారు. ఆయన తెలుగువారు కావడం గర్వకారణమన్నారు.ఈకార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నేతన్న నేస్తంకు 300 కరెంటు యూనిట్ల నిబంధనలు తొలగించాలి

-పద్మసాలే కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు

వెంకటగిరి ఆగస్టు 2 ప్రభాతవార్త



చేనేత కార్మికుల ప్రతి ఇంటిలో కరెంటు మగ్గాలు ఉన్నాయని అందరి 300 యూనిట్లపైన కరెంటు కాలుతుందని, కనుక నేత కార్మికులకు ఈ నిబంధనలు తొలగించాలని పద్మసాలే కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మాస్టర్‌వీవర్స్ ఎంఎల్ఏ ఆనం రామనారాయణరెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.300 యూనిట్ల నిబంధనలు పెట్టడం వల్ల చేనేత కార్మికులకు నేతన్న నేస్తం పథకం వర్తించడంలేదన్నారు.చేనేత కార్మికుల ఇళ్లలో మగ్గాలు ఉంటున్నందువల్ల వారికి ఇచ్చే 9 అంకణాల స్థలం చాలదని, కనుక 15 అంకణాల వరకు స్థలం ఇస్తే బాగుంటుందని తెలిపారు. ముడి సరుకులకు 40 శాతం రాయితీ ఇవ్వాలని తెలిపారు.

## ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేయాలి :ఎంపిపి

బాలాయపల్లి ఆగస్టు 2 పభాతవార్త



ప్రతి ఇంటిపై జాతీయ జండాను ఎగురవేయాలని ఎంపిపి జి.భాస్కరరెడ్డి తెలిపారు.మంగళవారం జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతి సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల వద్ద జాతీయ జెండాలను ఎగుర వేయాలని తెలిపారు. ప్రతి ఒక్క రింటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురు వేసి సా వ్వతంత్ర్యం కోసం పోరాడిన వారిని స్మరించుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రమణయ్య,తాసిల్దార్ సుబ్రమణ్యం, డిప్యూటితాసిల్దార్ అజ్మతుల్లా ఖాన్,ఎపిఎంకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పింగళి వెంకయ్య జయంతి

చిట్టమూరు, ఆగస్టు 2, ప్రభాతవార్త:

మండల పరిధిలోని గణపర్తి మార్కండేయనాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం భారతదేశ జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఆజాదీ కా అమృత్ కార్యక్రమంలో భాగంగా జరిగిన ఈ కార్యక్రమానికి ఎస్ఐ కె.గోపి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈసందర్బంగాఆయనమాట్లాడుతూవిద్యార్థులందరూబాగాచదువుకునిపింగళివెంకయ్యను ఆదర్శంగా తీసుకునిదేశభక్తినికలిగిఉండాలన్నారు.ప్రధానోపాధ్యాయులు మీనాకుమారి, ఉపాధ్యాయులు చక్రవర్తి, పద్మావతి,సుభాషిణి,వెంకటేశ్వరరావు,భరత్‌మహిపతి, సురేంద్రరెడ్డి, సుబ్బయ్య,తిరుపతయ్య, అపర్ణ,వెంకటేశ్వరమ్మ,పెంచలయ్య,దినకర్‌బాబు,లత,రఘుపతి, శ్రీనివాసు లురెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## సొంత డబ్బులతో అంబేద్కర్ కాంస్య విగ్రహన్ని ఏర్పాటు

-ఎంఎల్ఏ ఆనం రామనారాయణరెడ్డి

వెంకటగిరి ఆగస్టు 2 ప్రభాతవార్త



పట్టణంలోని కాంపాళెంలో తన సొంత డబ్బులతో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్అంబేద్కర్ కాంశ్య విగ్రహన్ని ఏర్పాటు చేస్తానని మాజీ మంత్రి,ఎంఎల్ఎ ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. మంగ ళవారం పట్టణంలోని 25వ వార్డు కాంపాళెంలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మా ట్లాడుతూ కాంపాళెంకు గాంధీ మహాత్ముడు వచ్చినందువల్ల ఆయన వి గ్రహన్ని ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. అదేవిధంగా 60 లక్షల రూపాయలతో కమ్యూనిటీ హాల్‌ను నిర్మిస్తానని తెలిపారు. ఇక్కడ పార్కును కూడా ఏర్పాటు చేయిస్తానని తెలిపారు.పేదలకు వైసిపి ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. విజయవాడలో బుధ వారం జరుగబోవు రాయసీమ జిల్లాల నేతలతో సిఎం జగన్‌మోహన్ రెడ్డి సమావేశం నిర్వహిస్తున్నారని నియోజవర్గ అభివృద్ధికి నిధులను ఇస్తానని తెలిపారు. సోమశిల-స్వర్ణముఖి లింకు కెనాల్, పట్టణంలో మరో సమ్మర్ స్టోరేజ్‌ట్యాంకు. వందపడకల ఆసుపత్రి తదితర అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వమని కోరుతానని తెలిపారు. ఆరవ వార్డులో 8 కోట్ల రూపాయల వరకు ప్రజల కోసం ఖర్చు చేసినట్లు వివరించారు. ఎమ్మెల్యే ఆనంకు హారతులు పట్టి ఘనస్వాగతం పలికారు. గడప గడపకు మనప్రభుత్వం పరిశీలకు మెట్టుకూరుదనుంజరెడ్డి,జిల్లా గ్రంథాలయసమ్మచైర్మన్‌దొంతు శారద, మున్సిపల్ చైర్‌పర్సన్ నక్క భానుప్రియ, పద్మసాలే కార్పోరేషన్‌రాష్ట్ర డైరెక్టర్ నక్క వెంకటేశ్వరరావు,కమీషనర్ గంగాప్ర సాద్,వైస్ చైర్మన్లు బాలయ్య,ఉమామహేశ్వరి,కౌన్సిలర్స్ మాడజానకీరామయ్య,పి లక్ష్మీ, నారి శేఖర్,గోపాలకృష్ణ, దనియా రాధ, శుభావళి,మాజీ పోలేరమ్మ ట్రస్టుబోర్డు చైర్మన్ పి ప్రసాద్‌రెడ్డి, న్యాయ వాదుల సంఘం

## 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలి

-పట్టణ వైసిపి అధ్యక్షుడు ఢిల్లిబాబు

వెంకటగిరి ఆగస్టు 2 ప్రభాతవార్త



స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జండాను ఎగుర వేయాలని పట్టణ వైసిపి కన్వీనర్, కౌన్సిలర్ జి డిల్లిబాబు తెలిపారు.మంగళవారం పట్టణంలో గాంధీ వీధిలోని సచివాలయం పై ఆయన ఉద్యోగులతో కలసి జాతీయ జెండా ఎగుర వేశారు. ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన వారిని ఎన్నటికి మరువ రాదన్నారు.వారిని స్మరించుకోవాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం మేరకు జాతీయ జండాలను ఎగురవేయాలని సూచించారు.ఈ కార్ యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా పింగళి వెంకయ్య జయంతి వేడుకలు

నాయుడుపేట, ఆగస్టు 2 ప్రభాతవార్త

నాయుడుపేట మున్సిపల్ కార్యాలయంలో మువ్వన్నెల జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక ముందుగా కార్యాలయంలో కమిషనర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కౌన్సిలర్లతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేశారు. ఆమె మాట్లాడుతూ మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలైందని, ఆగస్టు 15న, జనవరి 26న జాతీయ జెండాను ఎగురవేసి సంతోషంగా ఉన్నామే తప్ప ఆ మువ్వన్నెల జాతీయ పతాకాన్ని రూపొందించిన పింగళి వెంకయ్య గురించి తెలియదన్నారు. పింగళి వెంకయ్య కృష్ణా జిల్లా వాసు కావడం చాలా గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కమిషనర్, సిబ్బంది ఉన్నారు.

## పింగళి వెంకయ్యకు ఘన నివాళి

కోట, ఆగస్టు 2 ప్రభాతవార్త

జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య 146వ జయంతిని పురస్కరించుకొని స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం తహశీల్దార్ పద్మావతి ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ పద్మావతి మాట్లాడుతూ జాతీయ పతాకాన్ని రూపొందించి కోట్లాది మంది గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన పింగళి వెంకయ్య చరితార్థుడని కొనియాడారు. భారతావని స్వాతంత్ర్య అమృత మహోత్సవాలు జరుపుకుంటున్న వేళ హర్ ఘర్ తిరంగా అంటూ మువ్వన్నెల జెండా ప్రతి ఇంటిపై ఎగరాలని ఆమె కోరారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో భవాని ఆయన చిత్రపటానికి నివాళి అర్పించి పింగళి వెంకయ్య సేవలను కొనియాడారు.

## నవరత్నాలతో ప్రజలకు లబ్ధి

- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట, ఆగస్టు 2 ప్రభాతవార్త



నవరత్నాలలో భాగంగా ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధి చేకూరుస్తున్నాయని స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బాపూజీ కాలనీలో ఆయన పర్యటించారు. ఇంటింటికి వెళ్లి నవరత్నాల కార్యక్రమాలలో భాగంగా సంక్షేమ ఫలాలు అందుతున్నాయా అని ఆయన ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, వైసీపీ నాయకులు కళత్తూరు శేఖర్‌రెడ్డి, జెట్టి వేణు, వైస్ ఛైర్‌పర్సన్ పోలూరు పద్మ, కౌన్సిలర్ మీజూరు రామకృష్ణారెడ్డి, పముజుల విజయలక్ష్మి, కమిషనర్ నాగిశెట్టి నరేంద్రకుమార్, పలువురు నేతలు పాల్గొన్నారు.

## అర్హులకు పక్కాఇళ్లు ఇవ్వండి

సూళ్లూరుపేట, ఆగస్టు 2 ప్రభాతవార్త



సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో ని వట్రపాలెంలో నివసిస్తున్న అర్హులైన పేద కుటుంబాల వారికి పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని స్థానిక సీపీఐ నాయకులు మంగళవారం తహశీల్దార్ రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ వట్రపాలెంలో నివసిస్తున్న 30 కుటుంబాలకు ఇంత వరకు ఎటువంటి నివేశన స్థలా లు, పక్కాఇళ్లు లేవని, వీరికి పక్కా ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మోదుగుల పార్ధసారధి, ఎ.ఆనంద్‌బాబు, చెంచమ్మ, బాలయ్య, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పింగళి వెంకయ్యకు భారతరత్న ప్రకటించాలి

గూడూరు,ఆగస్టు 3 ప్రభాతవార్త



భారతజాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్యకు భారత ప్రభుత్వం భారతరత్న బిరుదు ప్రదానం చేయాలని భారతీయ శిక్షణ్ మండల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేశిరెడ్డి రాజేంద్రరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.మంగళవారం గూడూరు మండలం మంగళపూరు ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య 146వ జయంతి వేడుకలను భారతీయ శిక్షణ్ మండల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మన తెలుగువాడు మేధావి స్వాతంత్ర సమరయోధులు నిస్వార్థంగా దేశసేవ చేసిన మహనీయుడు మన జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య దేశప్రజలందరికి గర్వకారణమన్నారు. ఈసందర్బం గా విద్యార్థులకు జాతీయ పతాక రూపశిల్పి జెండా వెంకయ్య అంశంపై వక్తృ,చిత్రలేఖన దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించి అందరికీ జాతీయ జెండాలు అందజేశారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలోఉపాధ్యాయులుఎం.మునిరాజాచారి, ఏ.రవి,ఎస్.రవీంద్ర,జబీనా,సుల్తానా, ఎస్.వెంకటేశ్వర రావు,ఎస్‌డి ఫజల్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## జాతీయ జెండా రూపకర్తలకు ఘన నివాళి

నాయుడుపేట, ఆగస్టు 2 ప్రభాతవార్త



నాయుడుపేట మండల ప్రజా పరిషత్ కార్యాల యంలో మంగళ వారం జాతీయ జెండా రూపకర్త, స్వాతంత్ర్య సమరయోధులు పింగళి వెంకయ్య, బళ్లారి రాఘవయ్యల జయంతి సందర్భంగా ఘనంగా నివాళి అర్పించారు. ఎంపీడీవో కార్యాలయంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి, పలువురు సర్పంచులు అధికారులు ఉన్నారు.

# పెద్దాయనతో కలిసి ఇక రాజకీయ ప్రయాణం చేయలేం!



కోట, ఆగస్టు 2 ప్రభాతవార్త : వైకాపా కేంద్ర నిర్వాహక కమిటీ సభ్యులు కొడవలూరు ధనుంజయరెడ్డి, మా పెద్దాయన మాటకు ఎప్పుడూ విలువ ఇస్తామని, కాని ఆయన చెప్పుడు మాటలు విని మా ప్రాంతంలో బలంగా ఉన్న వైకాపాలో వర్గాలుగా తయారు కావడానికి కొందరు ప్రయత్నాలు చేస్తున్నారని వైకాపా సీనియర్ యువ నాయకుడు ఎం.రాజేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం రాఘవపురంలో తన నివాసంలో గ్రామస్థులతో కలిసి విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. పార్టీ కొరకు పెద్దాయన మీద ఉన్న గౌరవం కోసం రాజకీయంగా,ఆర్థికంగా ఎంతో నష్టపోయామని చెప్పారు. ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, ధనంజయరెడ్డిలు రెండు వర్గాలుగా గ్రామం విడిపోయింది ఎవరి వల్లనో అందరికీ తెలుసన్నారు. చివరికి హత్యల వరకు గ్రామాన్ని ఎవరో నాసినం చేస్తున్నారో అనే విషయం కూడా ఆయనకు తెలుసన్నారు. తామంతా తెలుసుకుని రెండు వర్గాలు ఒక్కటిగా ఉండి గ్రామంలో ఎలాంటి వివాదాలు లేకుండా ఉందామని అనుకున్నామన్నారు. ఆమేరకు గురుస్వామి, ప్రసాద్‌లు కలిసి చిట్టేడు సొసైటీ త్రీమెన్ కమిటీ ఛైర్మన్ విషయంలో కూడా కలిసి గ్రామంలో అందరం ఒకే తాటిపై ఉన్నామన్నారు. పెద్దాయన అనుచరుడుగా చలామణి అవుతున్న ఆ వ్యక్తి వలన మళ్లీ గ్రామంలో వివాదాలు జరిగే పరిస్థితులు ఏర్పాడుతాయే మోనని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్న పళంగా తీమ్రేన్ కమటీని ఎందుకు రద్దుచేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఏమైనా అవినీతి జరిగిందా ? ఇంకామైన జరిగిందా అనేది తమకు తెలియాల్సిన అవపరం లేదా అన్నారు. కేశవరం ఎంపిటిసీ ఎన్నికల్లో ఇండిపెండిటెంట్ అభ్యర్ధి గెలుపు కొరకు తాము పడిన శ్రమ అంతా ఇంత కాదన్నారు. పార్టీ కొరకు కష్ట పడి పనిచేసే వారికి కోట మండల పరిషత్ కార్యలయాంలో విలువు గౌవరం లేకుండా పోయిందన్నారు. కనీసం ఒకపని కూడా ప్రజలు చేయించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దధనంజయరెడ్డి చెప్పుడు మాటలు వినడం మానేవేయాలని రాజేంద్ర సూచించారు. గ్రామం లో 18 మందిపై రౌడీ షీట్లు ఉన్నాయంటే తమకు ఏంతో అవమానంగా ఉందన్నారు. ప్రశాంతం గా ఉన్న మా పంచాయతీలో కోట కు చెందిన వ్యక్తి ఏందుకు తల దూర్చుతున్నాడని ఆయన ప్రశ్నించారు. అయితే డిఆర్ వర్గం నుంచి తప్పకుంటున్నామే తప్ప పార్టీ మారే ప్రశక్తి లేదని ఒక ప్రశ్నకు సమాదనం చెప్పారు.ఆయన వెంట మాజీ ఎంపిటిసి కృష్ణయ్య, తదితరులు ఉన్నారు.

## పేనా పట్టే చేతులతో... పార,గునపం!

**-పరిశుభ్రతిరుమలలో బాలాజీనగర్‌లో ధర్మారెడ్డి శ్రమదానం**



తిరుమల,ఆగస్టు 2 ప్రభాతవార్తప్రతినిధి: సహజంగానే పుణ్యక్షేత్రం తిరుమలకొండ పరిశుభ్రతకు మారుపేరుగా ఉంటుంది. అలాంటిది కొండపై ఏళ్ళతరబడి స్థానికులు నివాసముంటున్న బాలాజీ నగర్ ప్రాంతాన్ని మరింత స్వచ్ఛతిరుమలగా తీర్చిదిద్దేందుకు ఏకంగా టిటిడి ఇఓ ఏవి ధర్మారెడ్డి స్వచ్ఛందంగా శ్రమదానం చేసేందుకు ముందుకుకదిలారు. ఇంకే ముంది ఆయన వెనుక టిటిడి ఆరోగ్యవిభాగం, పారిశుధ్య, ఇంజనీరింగ్ సిబ్బందితో బాటు స్థానికులు కూడా అడుగేశారు. స్థానికులు నివాసముంటున్న బాలాజీనగర్‌ను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. మంగళవారం ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నాం 12గంటల వరకు ఈ శుభ్రత కార్యక్రమం చేపట్టారు. సుందరంగా తీర్చిదిద్దారు.సహజంగానే టిటిడి ఇఓగా బాధ్యతలు నిర్వహించే అధికారులు చూడటానికి తిరుమలలో సర్వంతామై... చేతిలో పచ్చఇంకు పేనాతో రాసిందే రాత....పెట్టిన సంతకమే బ్రహ్మగీతగా భావిస్తారు. ఏసి కార్లలో తిరుగుతూ, ఏసి గదులకే పరిమితమైపోతారనే నానుడికి భిన్నంగా టిటిడి ఇఓ ధర్మారెడ్డి స్వచ్ఛ తిరుమలలో పాల్గొని బాలాజీనగర్ పూర్తిగా శుభ్రం చేయడం, మురికికాలువల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించడం, నిరుపయోగంగా పడివున్న వస్తువులను తీసేయడం జరిగింది.

## దేశమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి రోజా



పుత్తూరు, ఆగస్టు 2 ప్రభాతవార్త : ఆడి నెల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నగరి పట్టణంలోని శ్రీ దేశమ్మ అమ్మవారికి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా, సెల్వమణి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. మొదటి సారిగా టిటిడి తరపున మంత్రి రోజా సెల్వమణి దంపతులు ఆలయ సమీపంలోని శ్రీ వినాయక స్వామి ఆలయం నుంచి కాలినడకన పట్టువస్త్రాలు తీసుకుని వెళ్లి అమ్మవారికి స్వయంగా సమర్పించారు. ఈ సందర్భంగా వీరికి ఆలయ నిర్వాహకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో అర్చకులు వేదమంత్రాలతో దంపతులను ఆశీర్వదించారు. అనంతరం ఆర్.కె.రోజా సెల్వమణి దంపతులు స్వయంగా పొంగలి వండి అమ్మవారికి నైవేద్యం అందించారు. కార్యక్రమంలో పలువురు వైకాపా ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతు భరోసా అక్రమాలపై విచారణ

**- అనర్హులు లబ్ధిపొంది వుంటే వారి నుండి రికవరీ**

పాలసముద్రం, ఆగస్టు 2 ప్రభాతవార్త: పాలసముద్రం మండలం వనదుర్గాపురం పంచాయతీలో రైతు భరోసా పథకంలో జరిగిన అక్రమాలపై వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయి విచారణ నిర్వహించారు. రైతు భరోసా పథకంలో అనర్హులు ఎవరైనా వుంటే వారి నుండి నిధులను రికవరీ చేస్తామని విచారణ అధికారులు పేర్కొన్నారు. వనదుర్గాపురం పంచాయతీ పరిధిలో రైతు భరోసా పథకం కింద అనర్హులు లబ్ధిపొందుతున్నారని జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురుప్రసాద్ ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ నిర్వహించారు. నగరి వ్యవసాయ శాఖ ఎడిలు ఆర్.మురళీ, రాధలు, మండల వ్యవసాయ అధికారి ఢిల్లీ ప్రసాద్, విఆర్ఓ టి.రంగయ్య, ఎంపిఇఓ శంకర్, సర్పంచ్ నరసింహరాజుల ఆధ్వర్యంలో వనదుర్గాపురం గ్రామ సచివాలయంలో క్షేత్ర స్థాయి విచారణ జరిగింది. ఈ మేరకు రైతు భరోసా పథకం కింద అనర్హులు ఎవరైనా లబ్ధిపొందివుంటే వారి నుండి నిధులను రికవరీ చేస్తామని విచారణ అధికారులు స్పష్టం చేశారు. వనదుర్గాపురం పంచాయతీలో కొంతమంది తమిళనాడు రాష్ట్రంలో నివాసం వుండే రైతులు, మృతి చెందిన రైతులు, అర్హత లేని కొంతమంది రైతులు లబ్ధి పొందుతున్నారని ఫిర్యాదులు వెళ్ళాయి. ఈ ఫిర్యాదులపై స్పందించిన అధికారులు విచారణ నిర్వహించి



ఎవరైనా అనర్హులు రైతు భరోసా పథకం కింద లబ్ధి పొందినట్లు తేలితే వారికి నోటీసులు జారీ చేసి వారి నుండి నిధులు రికవరీ చేస్తామని స్పష్టం చేశారు.

## కుప్పం ఏరియా ఆస్పత్రిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

**- జాడలేని వైద్యులు..సిబ్బంది !!**

**- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు !!**



కుప్పం, ఆగస్టు 2 ప్రభాతవార్త : కుప్పం ఏరియా ఆస్పత్రిలో మంగళవారం జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆస్పత్రి మెడికల్ సూపరింటిండెంట్‌తో పాటు డ్యూటీ డాక్టర్, వైద్య సిబ్బంది ఆస్పత్రిలో లేకపోవడంతో కలెక్టర్ ఆగ్రహించారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో తెచ్చేందుకు మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ నాడు -నేడు కార్యక్రమంలో అభివృద్ధి పనులు చేపడుతోందన్నారు. ప్రజారోగ్యంపై దృష్టి సారించాల్సిన వైద్యులు తమ వృత్తి పట్ల అంకిత భావంతో పనిచేసి రోగులకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. వైద్యులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ ఆస్పత్రికి వచ్చి పరిశీలన చేస్తుండగా ఎంఎస్ డా॥ ప్రవీణ్‌కుమార్, డ్యూటీ డాక్టర్ రాజు అక్కడకు చేరుకున్నారు. విధుల నిర్వహణ సమయంలో మరోసారి నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని వారిని కలెక్టర్ హెచ్చరించారు.

## శ్రీ ద్రౌపదీదేవి శ్రీ ధర్మరాజు స్వామికి పట్టు వస్త్రాలు మాంగళ్యం సమర్పించిన - మంత్రి రోజా, సెల్వమణి



పుత్తూరురూరల్, ఆగస్టు 2 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలో వెలసిన శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజుస్వామి తిరుణాళ్ల సందర్భంగా సాయంత్రం రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక వ్యవహారాల యువజన సర్వీసుల క్రీడా శాఖ మాత్యులు రోజా, సెల్వమణి దంపతులు మంత్రి హోదాలో పట్టు వస్త్రాలు, మాంగళ్యం సమర్పించారు. ఈ సందర్భంగా పిళ్లారిగుడి వీధిలోని శ్రీ సెల్వ వినాయక స్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు. అనంతరం పట్టు వస్త్రాలను బజారు వీధి, కార్వేటినగరం రోడ్డు, కాపు వీధుల మీదుగా ఊరేగించారు. అనంతరం దేవాలయానికి చేరుకున్నారు. దేవాలయం వద్ద ఆలయ చైర్మన్ లారీ మోహన్ అర్చకులు మోహన్, కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామివారికి అమ్మవారికి విశేష పూజలు చేశారు. అనంతరం పట్టు వస్త్రాలు అమ్మవారికి కల్యాణోత్సవం సందర్భంగా సమర్పించారు. అనంతరం ఆలయ చైర్మన్ లారీ మోహన్, రోజా, సెల్వమణి దంపతులను సన్మానించి ప్రసాదాలు అందించారు. ఆలయ ఆవరణలో భారత హరికథ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. అలాగే ఆలయంలో ఉదయం పల్లకిసేవ, మధ్యాహ్నాం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం పి.వి.అరుణాచలం మాజీ ఉపకులపతి ద్రవిడ విశ్వ విద్యాలయం కుప్పం వారిచే ఆధ్యాత్మిక ఉపన్యాసం, అలాగే గీతామందిరం వారిచే అన్నమయ్య సంకీర్తనలు కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవారికి కల్యాణోత్సవం కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామివారికి, అమ్మవారికి కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్‌చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## వరలక్ష్మీ వ్రతం ఏర్పాట్లు పరిశీలిస్తున్న చైర్మెన్



శ్రీకాళహస్తి,ఆగస్టు 2 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న ప్రసన్న వరదరాజస్వామి ఆలయ ప్రాంగణంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను మంగళవారం ఆలయ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు అధికారులతో కలసి పరిశీలించారు.ఈ నెల 5న సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని ప్రసన్న వరదరాజస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లుతో నిర్వహించుటకు దేవస్థానం నిర్ణయించింది. గతంలో ఇక్కడ ఉన్న కళ్యాణ మండపంలో నిర్వహించే వారు. ప్రస్తుతం ఆలయ పరిసరాలు జీర్ణోద్ధారణ కార్యక్రమాలు చేపట్టారు. దాంతో ఎక్కడ నిర్వహిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో అధికారులు, ధర్మకర్తల మండలి చర్చించిన మీదట ప్రసన్న వరదరాజస్వామి ఆలయ ప్రాంగణంలోనేనిర్వహించుటకు తీర్మానించారు. మంగళవారం చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు. ఇక్కడ ప్రత్యేకంగా చలువ పందిళ్ళు ఏర్పాటు చేయాలని సూచించారు. వచ్చిన మహిళా భక్తులకు ఏలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయూలని ఆదేశించారు. ఇది పూర్తిగా మహిళలతో కూడుకున్న పూజా కార్యక్రమా లు, అంతేకాక మహిళా భక్తుల మనోభావాలకు సంబంధించిన పూజలు కాబట్టి ఎలాంటి ఇబ్బందులుండ రాదని సూచించారు.ఈ సందదర్భంగా చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ రెండేళ్ళ పాటు కరోనా ప్రభావంతో ఏకాంతంగా నిర్వహించారు.ఈ ఏడాది మహిళ భక్తుల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నారు.కాబట్టి వారిమనోభావాలకు అనుగుణంగా ఏర్పాట్లు ఉండాలన్నారు. శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి మహిళలకు వాయనాలు ఇస్తారని చైర్మెన్ అధికారులకు వివరించారు.ఈ పరిశీలనల్లో బోర్డు సభ్యులు బుల్లెట్ జయశ్యాం, సాధనమునస్వామి రాయల్, డిఇఇమురళీధర్‌రెడ్డి, ఎఇఇ శోభారాణి, చిన్న ఆలయూల ఇన్‌చార్జి లక్ష్మయ్య, వర్క్ ఇన్సెపెక్టర్ లక్ష్మయ్యలు పాల్గొన్నారు.

## అడవుల సంరక్షణకు చర్యలు చేపట్టండి

**-ఎంపి డాక్టర్ గురుమూర్తి**



తిరుపతి,ఆగస్టు 2 ప్రభాతవార్త: దేశంలో అడవుల పెంపకంలో భాగంగా అటవీ ప్రయోజనాల కోసం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అడవుల అభివృద్ధికి, సంరక్షణకు తీసుకుంటున్న చర్యలు గురించి వివరించాలని తిరుపతి ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి కోరారు. మంగళవారం పార్లమెంట్ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ అటవీప్రాంతాల్లో అక్రమిత వృక్షాల తొలగింపు, పలు ఉపయోగకరమైన వృక్షాల సంరక్షణపై వివరణ కోరారు. దీనిపై కేంద్రమంత్రి సాధ్వినిరంజన్‌జ్యోతి బదులిస్తూ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం డిమాండ్ ఆదారిత వేతన ఉపాధి కార్యక్రమం అని, ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికి డిమాండ్‌కు అనుగుణంగా ఆర్థిక సంవత్సరంలో వందరోజుల కంటే తక్కువ కాకుండా నైపుణ్యంలేని మాన్యువల్ పనిని హామీతో కూడిన ఉపాధిగా పరిగణిస్తామన్నారు. మొక్కల పెంపకం, సంరక్షణ, కలుపుమొక్కల తోలగింపు వంటివి చేపడతారన్నారు.

## ఆత్మవిశ్వాసంతో,పట్టుదలతో కర్తవ్యనిర్వహణ

**-పింగళివెంకయ్య జయంతిలో అదనపు ఎస్పీ సుప్రజ**



తిరుపతి,ఆగస్టు 2ప్రభాతవార్త: మొక్కవోని పట్టుదలతో కృషితో త్రివర్ణపతాకాన్ని రూపొందించిన పింగళి వెంకయ్య కర్తవ్యనిర్వహణను అందరూ ఆదర్శంగా తీసుకుని పనిచేయాలని తిరుపతి అదనపు ఎస్పీ ఇ.సుప్రజ తెలిపారు. పింగళివెంకయ్య 146వ జయంతి సందర్భంగా మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పి పరమేశ్వరరెడ్డి ఆదేశాలతో అదనపు ఎస్పీ సుప్రజ జాతీయజెండాను ఎగురవేసి గౌరవవందనం సమర్పించారు.అనంతనం ఆమె పింగళి వెంకయ్య గురించి వివరించారు. ప్రతి పోలీసుస్టేషన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఎస్పీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి వనజాక్షి, డిసిఆర్‌బి సిఐ చంద్రశేఖరపిళ్ళై, ఆర్ఐ అడ్మిన్ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## గణనాధుని దర్శించుకున్న ఎమ్మెల్సీ కళ్యాణి



కాణిపాకం, ఆగస్టు 2 ప్రభాతవార్త: విశాఖ ఎమ్మెల్సీ కళ్యాణి కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆమెకు ఆలయ ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆమె స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆమెకు వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయ స్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు ఎమ్మెల్యే వెంట ఆలయ అధికారులులు పాల్గొన్నారు.

## కార్పొరేటర్ ఇందు అత్మహత్యాయత్నం

చిత్తూరు, ఆగస్టు 2 ప్రభాతవార్త: చిత్తూరు నగర కార్పొరేటర్ ఇందు మంగళవారం ఆత్మహత్యాయత్నంకు పాల్పడింది. కార్పొరేటర్ ఇందు మూడు రోజుల క్రితం తనను కొందరు బెదిరిస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆపై మంగళవారం ఆమె ఆత్మహత్యాయత్నంకు పాల్పడింది. అయితే ఆమె ఆత్మహత్యాయత్నంకు పాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

## హరోంహర వేళమురగ..

**- వానగుట్టపల్లిలో ఘనంగా ఆడికృత్తిక వేడుకలు.**

కుప్పంరూరల్ ఆగస్టు 2 ప్రభాతవార్త : మండలంలోని వానగుట్టపల్లి గ్రామంలో మంగళవారం హరోంహర నినాదాలతో మార్మోగింది. ఆడికృత్తిక సందర్భంగా స్థానికంగా శ్రీ సుబ్రమణ్యస్వామి ఆలయంలో విషేష పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మొక్కులు కలిగిన భక్తులు వీపుకు కొక్కీలు తగిలించుకుని క్రేన్లలో వేలాడుతూ ఆలయంవద్దకు బారీ సంఖ్యలో చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. తమిల్‌నాడుకు చెందిన ప్రత్యేక వాయిద్యబృందాలు కావడి భజనలు పాడుతూ గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.ఈ పండగను తిలకించేందుకు సమీప గ్రామాలనుంచి ప్రజలు అధికసంఖ్యలో హాజరయ్యారు.భక్తులకు గ్రామంలో పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

## సిఎంకు పేర్నాటి నేచురల్స్ అందచేత



కోట,ఆగస్టు 2 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డికి, తూర్పురాయలసీమ వైకాపా అభ్యర్ధి,రాష్ట్ర వైకాపా కార్యదర్శి,పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి దంపతులు మంగళవారం తాడేపల్లి సిఎం క్యాంప్ కార్యాలయంలో పేర్నాటి నేచురల్స్ మొట్ట మొదటి ఉత్పాదనలను అంద చేశారు. తన వ్యవసాయ క్షేత్రంలో పూర్తి స్థాయలో గొ ఆధారిత వ్యవసాయం చేస్తూ పండించిన ధాన్యం,వేరు శనగ పప్పు దినుసులను వాటికి సంధించిన నూనె ఉత్పాదనలను పేర్నాటి నేచరల్స్ పేరుతో తయారు చేసి అందించడం జరిగిందని శ్యామ్ ప్రసాద్ రెడ్డి ప్రభాతవార్త కు తెలిపారు. ఆమేరకు ఆయన మాట్లాడుతూ తన వ్యవసాయ క్షేత్రంలో పండించిన ఉత్పత్తులను గురించి ముఖ్యమంత్రికి వివరించడం జరిగిందన్నారు. దీంతో సిఎం చాలా సంతోషపడ్డారని చెప్పారు. రాబోవు రోజుల్లో జిల్లా ప్రజలకే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా పూర్తి స్థాయిలో సేంద్రీయ పద్ధతులతో పండించిన ఉత్పత్తులను అందించాలని లక్ష్యంతో ముందుకు పోతామన్నారు. పేర్నాటి నేచురల్స్‌కు సంబంధించి ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికేషన్ పొందడం జరిగిందన్నారు. పేర్నాటి వారసురాలు బిందు ఐశ్వర్యకూడా ఉన్నారు.

## 'మన్యం రాజు' మంచి సందేశాత్మక చిత్రం!

**-సినీ నటుడు సుమన్ కితాబు**



తిరుపతి ప్రెస్‌క్లబ్,ఆగస్టు 2 ప్రభాతవార్త: 'మన్యం రాజు' లాంటి ఒక మంచి సందేశాత్మక చిత్రాన్ని నిర్మించి తెలుగు ప్రేక్షకులకు అందిచబోతున్న చిత్రనిర్మాత డా॥యలమంచిలి ప్రవీణ్ అభిరుచి, ఆకాంక్ష అభినందనీయమని ప్రముఖ సినీ నటుడు సుమన్ హర్షం వ్యక్తంచేశారు.మంగళవారం స్థానిక ఓ ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సినిమా ప్రివ్యూ షోకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి చిత్రాన్ని వీక్షించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో యువత చెడు అలవాట్లకు బానిసలయ్యి పెడదారిపడుతున్న ఈ రోజుల్లో యాంటీ డ్రగ్స్ మీద ధైర్యం చేసి సినిమా నిర్మించడం గొప్ప సాహసమనే చెప్పాలన్నారు.సినిమాలో ప్రతి ఒక్కరు చక్కగా నటించి తమ పాత్రలకు న్యాయం చేశారన్నారు. చిత్రంలో భీమాస్ అశోక్ ప్రత్యేక పాత్రలో అద్భుతంగా నటించాడని అన్నారు.సినిమాకు సంబంధించి యూనిట్ సభ్యులు,టెక్నీషియన్లు తమ ప్రతిభనుకనబరచడం విశేషమన్నారు.ఈ ప్రివ్యూ షో కార్యక్రమంలో దర్శకుడు సోమసుందరం,మూర్తి స్వామి, చరణ్, కృష్ణచైతన్య, వెంకీ,భాను,తదితరులు పాల్గొన్నారు.

## ధ్వజారోహణంతో ప్రారంభమైన వీరభద్రుని బ్రహ్మోవాలు

నారాయణవనం, ఆగస్టు 2 ప్రభాతవార్త : మండల కేంద్రంలోని నారాయణవనం మేజర్ పంచాయతీ పరిధి చిత్రాంగి కోటవీధి సముదాయం మార్గంలో వెలసిన టిటిడి అనుబంధ ఆలయం భద్రకాళీ సమేత కల్యాణ వీరభద్రస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబందించి మంగళవారం ఉదయం అంకురార్పణ నిర్వహించారు. సాయంత్రం ధ్వజారోహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవారిని చంద్రప్రభవాహనంపై గ్రామవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, పూజారి అయ్యప్ప, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దాడి చేశారని ఫిర్యాదు

నాయుడుపేట, ఆగస్టు 2 ప్రభాతవార్త : నాయుడుపేటలో హౌసింగ్ లోన్ రికవరీ విషయంలో ఒకరిని ఒకరు దాడులు చేసుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు. నాయుడుపేట బీడీ కాలనీకి చెందిన గోవింద్ కోటేశ్వరరావు ఫైవ్ స్టార్ ఫైనాన్స్ కంపెనీలో సుమారు రూ.4 లక్షలు రుణం తీసుకున్నాడు. నాలుగు నెలలు ఈఎంఐ పెండింగ్‌లో ఉండటంతో ఫైనాన్స్ వారు తమ ఇంటికి వచ్చి తన తమ్ముడు గోవింద శ్రీనివాసులును దుర్భాషలాడి తమపై దాడి చేశారని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే నాలుగు నెలలు పెండింగ్‌లో అడగడానికి వెళ్లగా గోవింద కోటేశ్వరరావు తమ్ముడైన శ్రీనివాస్ దుర్భాషలాడి దాడికి యత్నించడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

## 7 నుంచి నీలకంఠేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

**సిబ్బందికి విధుల కేటాయింపు**

శ్రీకాళహస్తి,ఆగస్టు 2 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయాల్లో ఉత్సవాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని స్థానిక శాసనసభ్యుడు బియ్యపు మధుసూదనరెడ్డి దేవస్థానం అధికారులు, ధర్మకర్తల మండలికి సూచించారు.ఈ నేపథ్యంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించుటకు చర్యలు తీసుకుంటున్నారు. ఆలయానికి అనుబంధంగా ఉన్న ఊరందూరులో వెలసిన అన్నపూర్ణా సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలోబ్రహ్మోత్సవాలు నిర్వహణకు ఆలయాదికారులు, ధర్మకర్తల మండలి సమీక్షించారు.ఈ నెల 7 నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహించుటకు నిర్ణయించారు.ఈ మేరకు ఇఓ సాగర్‌బాబు ప్రత్యేక సిబ్బందిని నియమిస్తూ ఉత్తర్వులుజారి చేసారు.ఇక్కడ ఉత్సవాలకు సంబంధించి జూనియర్ అసిస్టెంట్ వై.లక్ష్మయ్య,, రికార్డు అసిస్టెంట్ జి.దుర్గా ప్రసాద్‌లను నియిమించారు. వీరి పర్యవేక్షణలో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉత్సవాలను నిర్వహించాలని ఆదేశించారు.అలాగే ఉత్సవాల బాధ్యతను సి.దామోదరం, అవుట్ సోర్సింగ్ సిబ్బంది యం.శేఖర్, జి.నాగరాజులను నియమించారు. ఇక విద్యుత్ సమస్యలకు సంబంధించి, డెకరేషన్‌లను ఎలక్ట్రికల్ ఇన్‌చార్జి కె.మురళి పర్యవేక్షించాలని నిర్ణయించారు.ఈ మేరకు ఇఓ సాగర్‌బాబు ఉత్తర్వులు జారి చేసారు.

**5న వరలక్ష్మీ వ్రతం:**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని ప్రసన్న వరదరాజస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించుటకు నిర్ణయించినట్లు ఆలయ ఇఓ కెవి సాగర్‌బాబు మంగళవారం ఓ ప్రకటనలో లిపారు.ఈ ఉత్సవం ఎక్కడ నిర్వహించాలనే సందిగ్దంలో ఉన్న ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహించి అర్చకుల అభిప్రాయాలను తీసుకున్నారు. తరువాత సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని గతంలో లాగే ప్రసన్న వరదరాజస్వామిఆలయ ప్రాంగణంలో నిర్వహించుటకు తీర్మానించారు. ఈ నెల 5వతేది శుక్రవారం నిర్వహించుటకు తీర్మానించారు. పూజలు ఉదయం 7 గంటలకు ప్రారంభించాలని నిర్ణయించినట్లు ఇఓ సాగర్‌బాబు తెలిపారు.

## పింగళి వెంకయ్యను స్పూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి

**- మేయర్ డాక్టర్ శిరీష**

**-దేశభక్తి ఉత్సవాలలో సమిష్టిగా అందరు పాల్గొనాలి**

**-నగరపాలక కమిషనర్ అనుపమ అంజలి**





తిరుపతి కార్పొరేషన్ ఆగస్టు 2 ప్రభాతవార్త: జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య స్పూర్తిని ఆదర్శంగా తీసుకుని దేశభక్తిని పెంచుకోవాలని తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష పేర్కొన్నారు. పింగళి వెంకయ్య జయంతిని పురస్కరించుకుని మంగళవారం తిరుపతి నగరపాలక సంస్థ ఆవరణలో పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. అనంతరం జాతీయ జెండాను మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఎందరో త్యాధనుల ప్రాణత్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందనే విషయాన్ని గుర్తు చేసారు. జాతీయ జెండాను రూపొందించి, ప్రజల్లో దేశభక్తిని పెంపొందించిన పింగళి వెంకయ్య దేశ ప్రజలందరికి ఆదర్శమని పేర్కొన్నారు. 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రజలందరూ దేశభక్తితో జరుపుకోవాలని పిలుపు నిచ్చారు. నగరపాలక కమిషనర్ అనుపమ అంజలి మాట్లాడుతూ అజాదికా అమృత్ మహోత్సవాలలో దేశభక్తి ఉత్సవాలలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రతి ప్రభుత్వం కార్యాలయంపై ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి చాటిచెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ సునీత, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.